సాక్షి
అనంతపురం
గురువారం। 7। ఆగస్టు। 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.47

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.37 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/22.1°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

పరిష్కారం.. పరిహాసం

ప్రజల సమస్యలు పట్టడం లేదు. అధికారులు నిత్యం తిప్పించుకుంటున్నారు తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. అసలు ప్రజల నుంచి అందుతున్న అర్జీలను పరిశీలిస్తున్నారో లేదో కూడా తెలియడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా రాష్ట్రంలోనే జిల్లా చివరి స్థానంలో నిలవడం విమర్శలకు తావిస్తోంది.

- ప్రజా సమస్యల పరిష్కారంలో అట్టడుగున జిల్లా
- ఎక్కడ గ్రీవెన్స్ నిర్వహించినా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- తహసీల్దార్లు పదే పదే తిప్పకుంటున్నట్లు ఆరోపణలు
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో సామాన్యులకు తిప్పలు



అనేక సార్లు అర్జీలిచ్చినా సమస్య పరిష్కరించలేదంటూ ఈ నెల 4న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను ప్రశ్నిస్తున్న ఓ బాధితుడు

సాక్షిప్రతినిధి, అనంతపురం: జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం దారుణంగా ఉన్నట్టు తాజాగా వెల్లడైంది. 62 శాతం అర్జీలకు కంటి తుడుపుగా పరిష్కారం లభిస్తే.. 32 శాతం అర్జీలకు 8 నెలలుగా ఎలాంటి పరిష్కారం చూపలేదని తెలిసింది. ఈ క్రమంలో రాష్ట్రంలోనే జిల్లా చిట్టచివరి స్థానంలో ఉన్నట్లు తేలింది. స్వయానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే కలెక్టర్ల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. జిల్లాలోని 32 మండలాల్లోనూ వేల దరఖాస్తులకు మోక్షం లభించక మూలనపడ్డాయి. బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రతి సోమవారం కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' పేరుకు మాత్రమే జరుగుతోందంటూ బాధితులు వాపోతున్నారు. కలెక్టర్ ఆదేశించినా ఫలితం కానరాకపోవడంతో వారి వేదన వర్ణనాతీతంగా ఉంటోంది.

తహసీల్దార్ల వేధింపులు..

భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్రమంలో బాధితులు ముందుగా తహసీల్దార్ కార్యాలయాలకు వెళుతుండగా.. ఆదిలోనే హంసపాదు అన్నట్టు వీఆర్‌ఓలే యముడిలా వారిని అడ్డుకుంటున్నారు. అర్జీలపై చివరకు తహసీల్దార్ సంతకం చేసి ఆ వెంటనే అర్జీకి పరిష్కారం లభించినట్టు చూపిస్తున్నారు. అయితే, సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంటోంది. గ్రీవెన్స్ రోజు కాకుండా మిగతా రోజుల్లో సమస్య పెండింగ్‌లో ఉందని వెళితే తహసీల్దార్ తన గదిలోకి కూడా రానివ్వడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

ఏడాదిలో గ్రీవెన్స్‌కు వచ్చిన కొన్ని ముఖ్యమైన ఫిర్యాదులు

కేటగిరీ	ఫిర్యాదులు
రికార్డ్ ఆఫ్ రైట్స్	9,308
అసైన్‌మెంట్ హౌస్ సైట్స్	2,054
భూ కబ్జా ఫిర్యాదులు	1,183
అసైన్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్స్	886
రహదారి సమస్యలు	579
రీసర్వే సమస్యలు	514
22ఏ సమస్యలపై ఫిర్యాదులు	429

బిడ్డకు పింఛన్ రావడం లేదు



నా బిడ్డ పేరు మాన్విత సాయి. వయసు 11 ఏళ్లు. బుద్ధిమాంద్యంతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమితమైంది. ఎంఆర్‌ఐ తీయిస్తే 100 శాతం వైకల్యం ఉన్నట్టు వచ్చింది. సదరమ్ సర్టిఫికెట్‌కు స్లాట్ బుక్ చేస్తే ధర్మవరం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే అక్కడి డాక్టర్ కేవలం 45 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో మంచానికే పరిమితమైనా నా బిడ్డకు పింఛను రావడం లేదు.

–భవాని, చిన్మయానగర్, అనంతపురం

సర్టిఫికెట్ కోసం శ్రీకాళహస్తి వెళ్లమంటున్నారు

నేను దివ్యాంగుడిని. సదరమ్ సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేస్తే శ్రీకాళహస్తి ఆస్పత్రికి రెఫర్ చేశారు. అంత దూరం వెళ్లలేక స్లాట్ రద్దు చేసుకున్నా. ఇప్పుడు స్లాట్ బుక్ చేసుకుందామంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. సదరమ్ సర్టిఫికెట్ వస్తే కానీ నాకు పింఛను మంజూరు కాదని అధికారులు చెబుతున్నారు.

–హుసేన్, దివ్యాంగుడు, పూలగుట్టపల్లి, గుంతకల్లు మండలం

అధికారులు స్పందించడం లేదు

మాకు సర్వే నం. 236–1లో 3.80 ఎకరాల పట్టా భూమి ఉంది. రీసర్వే తరువాత ఆన్‌లైన్‌లో 2.29 ఎకరాలు అసైన్డ్ భూమిగా (ఎల్‌పీఎం నంబరు 1754) నమోదు చేశారు. మిగిలిన భూమిని ఎల్‌పీఎం నంబర్ 1341లో 236–2 అని తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వెబ్‌ల్యాండ్ సవరణకు తహసీల్దారు కార్యాలయంలో పలుమార్లు అర్జీలు సమర్పించినా అధికారులు స్పందించలేదు. దీంతో ఈనెల 21న కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చా.

– అనిల్‌కుమార్‌రెడ్డి, పి.జలాలపురం, శింగనమల మండలం

వేరొకరి పేరున ఆన్‌లైన్ చేశారు

మాకు గుత్తి మండలం గుత్తి గ్రామంలో ఖాతా నంబరు 1845 సర్వే నంబరు 296–ఎలో 5.43 ఎకరాల భూమి ఉంది. ఇది మా పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి. 1బీ, అడంగల్‌లోనూ నమోదయ్యింది. అయితే మా భూమిని తురకపల్లికి చెందిన ఏడు మంది అక్రమంగా తమ పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి బోగస్ 1బీ, అడంగల్ రద్దు చేయాలని విన్నవించా.

– సి.ఆనందసుధాకర్, ఎ.క్యాంపు, కర్నూలు నగరం

న్యూస్‌రీల్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం అర్బన్: 'వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా నిర్వహించేలా చూడండి. డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. వివిధ అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటి నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని చెప్పారు. ప్రజలు తమ నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. సీఎస్‌డీటీలు చౌక దుకాణాలను తనిఖీ చేసి నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు సరైన పరిష్కారం చూపకపోవడంతో అవి రీ–ఓపెన్ అవుతున్నాయని, గుంతకల్లు, ఉరవకొండ, బొమ్మనహాళ్, పామిడి, యల్లనూరు, యాడికి తదితర మండలాల్లో అర్జీల రీ–ఓపెన్ అధికంగా ఉందన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు.కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శైలజ, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, పీజీఆర్ఎస్ తహసీల్దారు వాణిశ్రీ, విభాగాల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షం



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ సమీపంలో రహదారిపై పారుతున్న వరద

అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. జిల్లా అంతటా వాన కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు బొమ్మనహాళ్ మండలంలో మినహా మిగతా 30 మండలాల పరిధిలో 31.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గుత్తి 71.4 మి.మీ, పెద్దవడుగూరు 70.4, గుంతకల్లు 68.2, రాయదుర్గం 64.2, పామిడి 53.2, అనంతపురం 48.4, నార్పల 45.4, కళ్యాణదుర్గం 40.4, గుమ్మఘట్ట 40.2, విడపనకల్లు 39 మి.మీ, బెళుగుప్ప 37.2, బుక్కరాయసముద్రం 36.2, శింగనమల 33.6, వజ్రకరూరు 32.6, బ్రహ్మసముద్రం 30, తాడిపత్రి 27.4, ఆత్మకూరు 26.5, ఉరవకొండ 24, గార్లదిన్నె 20.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 54.3 మి.మీ నమోదైంది.

సిద్ధం కాని 'ప్రత్యామ్నాయం'


వర్షాలకు జిల్లా అంతటా దాదాపు పదును అయింది. ముందుగా సాగు చేసిన ఖరీఫ్ పంటలకు ఊరటనిస్తుండగా 'ప్రత్యామ్నాయ' పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. అయితే, ప్రత్యామ్నాయంలో రైతులకు విత్తన సమస్య ఎదురవుతోంది. వ్యవసాయశాఖ ఇంకా ప్రణాళిక సిద్ధం చేయకపోవడంతో ఇప్పట్లో రాయితీ విత్తనం అందే పరిస్థితి కనిపించడం లేదు. కీలకమైన జూన్, జూలైలో నెలన్నర రోజుల పాటు సరైన వర్షాలు లేకపోవడంతో 50 శాతం వరకు భూములు బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి.లేకలేక వర్షాలు కురవడంతో ప్రత్యామ్నాయ సాగుకు సిద్ధంగా ఉన్నా కంది, ఉలవ, పెసర, అలసంద, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు తదితర విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు

జిల్లాకు 1,571 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు 1,571 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. స్పిక్ కంపెనీ నుంచి 754 మెట్రిక్ టన్నుల యూరియా, 407 మెట్రిక్ టన్నుల డీఏపీ, 410 మెట్రిక్ టన్నుల 20–20–0–13 రకం కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయన్నారు. జేసీ ఆదేశాల మేరకు ఇందులో 352 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్‌కు, మిగిలిన 402 మెట్రిక్ టన్నులను ప్రైవేట్ డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు.

రౌడీయిజం బాబు నైజం

- ఎమ్మెల్సీ రమేష్‌పై దౌర్జన్యం అప్రజాస్వామికం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో రౌడీయిజం, దౌర్జన్యం రాజ్యమేలుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో భాగంగా ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. 'అనంత' బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. దౌర్జన్యాలు ఎక్కువ రోజులు సాగవని, ఇప్పటికే చంద్రబాబు సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజల నుంచి తిరుగుబాటు తథ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో దారుణమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవలేక, ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు దాడులకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఎన్ని దౌర్జన్యాలు, దాడులకు పాల్పడినా అంతిమ గెలుపు వైఎస్సార్ సీపీదేనన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలకు అపార విశ్వాసం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా భయపడే ప్రసక్తి లేదన్నారు. ఎన్నికల్లో గెలవమని తెలిసే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో తాము తగిన బుద్ధి చెబుతామన్నారు. చంద్రబాబు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

మేసినోళ్ల గుండెల్లో రైళ్లు!

ఆర్టీఏ అధికారుల్లో 'ఏసీబీ' గుబులు

- ఇప్పటికే ఓ ఏఎంవీఐను సర్వీస్ నుంచి తొలగింపు
- ఉమ్మడి జిల్లాలోనూ పలువురిపై వేటు తప్పదని ఊహాగానాలు
- వణికిపోతున్న ఏసీబీ కేసులున్న అధికారులు



రవాణా శాఖ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: ఏసీబీ కేసుల్లో నిందితులుగా ఉన్న రవాణాశాఖ అధికారుల్లో గుబులు రేగుతోంది. ఇటీవల అనంతపురం రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారిని ఉద్యోగం (రిమూవ్ ఫ్రం సర్వీస్) నుంచి తొలగించడం అవినీతి అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోనూ పలువురిపై వేటు తప్పదని ఊహాగానాలు రేగడంతో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోననే ఆందోళనలో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రభుత్వానికి ఆదాయం తీసుకొచ్చే వాటిలో రవాణా శాఖ కీలకమైంది. ఇదే అదునుగా కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. మేసినంత మేస్తున్నారు. అలాంటి లంచావతారులపై అనేక సందర్భాల్లో అవినీతి నిరోధకశాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. జిల్లాలో ఒకే ఏడాదిలో రెండు, మూడు సార్లు దాడులు జరిగిన దాఖలాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పెనుకొండ సమీపంలో రవాణా శాఖ చెక్‌పోస్టు ఉన్న సమయంలో ఏసీబీ దాడులు సర్వసాధారణంగా ఉండేవి. అలా దాడులు జరపడం... ఇలా అవినీతి అధికారులను పట్టుకోవడం అన్న చందాన ఉండేదంటే అతిశయోక్తి కాదు. ఏసీబీ కేసుల్లో ఇప్పటికీ అనేక మంది ఉద్యోగులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

చర్యలకు ఉపక్రమణ..

లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులపై రవాణాశాఖ ఉన్నతాధికారులు ఇటీవల చర్యలకు ఉపక్రమించారు. ఈ విషయంలో రవాణా శాఖ కమిషనర్ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటీవల జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఏఎంవీఐని ఏకంగా సర్వీసు నుంచి తొలగించారు. గతంలో ఏసీబీకి పట్టుబడిన ఓ అధికారి ఇటీవల కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి రాగా పవర్స్ ఇవ్వకుండా ఉంచారు. ఆరు నెలలు దాటినా తిరిగి అధికారాలు పునరుద్ధరించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 25 మందికిపైగా ఉన్నట్లు సమాచారం. గతంలో జిల్లా కేంద్రంలో ఇద్దరు ఎంవీఐలు, ఓ ఏఎంవీఐ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో కూడా ఇద్దరు ఎంవీఐలు, ఓ చిన్న స్థాయి సిబ్బంది ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం వీరందరి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నట్లు సమాచారం.

హోంగార్డుల్లో కంగారు..

రవాణా శాఖలో డిప్యుటేషన్‌పై పనిచేసే పోలీసు శాఖకు చెందిన హోంగార్డులు కూడా అనేక సందర్భాల్లో ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఒకరిద్దిని ఇప్పటికే ఉద్యోగం నుంచి తొలగిస్తూ (రిమూవ్ ఫ్రం సర్వీస్) నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కొంతమంది కోర్టును ఆశ్రయించారు. పై అధికారులు చెబితేనే తాము చేశాం.. చిరుద్యోగులం.. తమపై ఏసీబీ కేసులు తొలగించాలంటూ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ అంశంపై కూడా త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశముందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

వీఆర్ఎస్.. వద్దులే!

ఉన్నతాధికారుల చర్యల నుంచి బయటపడేందుకు కొంతమంది స్వచ్ఛంద పదవీ విరమణ (వలంటరీ రిటైర్మెంట్) చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే పదవీ విరమణ అయినప్పటికీ ఏసీబీ కేసుల్లో ఉన్న అధికారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ రావని తెలియడంతో మిన్నకుండిపోతున్నారు. ఏదీ ఏమైనా రవాణాశాఖ అధికారులకు ఏసీబీ భయం కంటి మీద కునుకులేకుండా చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

హరిత నన్ను క్షమించు..

- అప్పుల భారంతో బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య
- బ్యాంకు బాత్‌రూంలో ఉరి వేసుకున్న వైనం



రవికుమార్ (ఫైల్)

అనంతపురం: 'హరిత నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభమూ లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపంగా మారాయి' అంటూ లేఖ రాసి ఓ బ్యాంకు ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి..వాటిని తీర్చేమార్గం కానరాక బ్యాంకు బాత్‌రూంలో ఉరేసుకుని తనువు చాలించాడు. వివరాలు..కర్నూలు నగరంలోని సీ క్యాంప్‌కు చెందిన సంకుల రవికుమార్ (40) గత 12 ఏళ్లుగా సెంట్రల్ బ్యాంకులో అటెండరుగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు అనంతపురంలో నివాసం ఉంటున్న ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లారు. 9.45 గంటలకు భార్య హరితకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పారు. 10.20 గంటలకు బ్యాంకు ఉద్యోగి పద్మజ ..అటెండర్ రవికుమార్ భార్యకు ఫోన్ చేశారు. బాత్‌రూంలోకి వెళ్లి లోపల లాక్ చేసుకున్నాడని, పిలిస్తే పలకడం లేదని, మీరు వెంటనే బ్యాంకుకు రావాలని చెప్పారు. 20 నిమిషాల్లో ఆమె అక్కడికి చేరుకుంది. కార్పెంటర్ సాయంతో బాత్‌రూం తలుపు పగులగొట్టారు. అప్పటికే బాత్‌రూం కిటికీ ఇనుప కడ్డీకి నైలాన్ తాడుతో ఉరివేసుకున్న రవికుమార్ విగత జీవిగా పడి ఉన్నాడు. అప్పులు అధికం కావడంతో మానసిక ఒత్తిడికి గురై అఘాయిత్యానికి పాల్పడినట్లు మృతుడి భార్య హరిత స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు సూర్యతేజ, కుమార్తెలు ఎస్.దీక్షిత, ఎస్.వీక్షిత ఉన్నారు.

అప్పులే శాపంగా మారాయి..

రవికుమార్ ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. అందులో ఏముందంటే... 'హరిత క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభమూ లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపంగా మారాయి. నేను ఎలాంటి జూదాలూ ఆడలేదు. అధిక వడ్డీలు కట్టలేక..వడ్డీలకు తిరిగి అప్పు చేసి అలా ఒకదానికి ఒకటి తోడయ్యాయి. కరణ్ నన్ను క్షమించరా.. నిన్ను మోసం చేశాను. అమ్మా.. నువ్వు జాగ్రత్త.. పిల్లలు జాగ్రత్త. నా టైం ఇక్కడితో అయిపోయింది. హుస్సేన్.. నేను ఎవరినీ మోసం చేయలేదు. ఎవరినైనా అప్పు అడుగుదామనుకుంటే నా పరిస్థితి బాగోలేదు. హుస్సేన్ నాకో హెల్ప్ చెయ్.. నా తర్వాత హరితకు బ్యాంకుకు సంబంధించి ఏదైనా సహాయం చేస్తావని నమ్ముతున్నాను. గుజ్జల రాముడు అనే వ్యక్తి దగ్గర రూ.50 వేలు అప్పు చేస్తే రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చాడు. ప్రతి నెలా రూ.15,000 వడ్డీ కడుతూనే ఉన్నాను. ఇప్పటి వరకు రూ.1,20,000 కట్టాను. ఇక నా వల్ల కాదు. హరీష్ సారీ రా..నీవు చాలా సార్లు హెల్ప్ చేశావు. నా కోసం చీటీ కూడా ఎత్తేసి డబ్బిచ్చావు. నువ్వు చాలా చాలా హెల్ప్ చేసినా.. నేను నీకోసం ఏమీ చేయలేని పరిస్థితి. కిశోర్ ఇకనైనా లోన్ కట్టుకోరా.. చాలా సార్లు హెల్ప్ చేశాను. కానీ నువ్వు చాలా మోసం చేశావు. హరిత పిల్లలు జాగ్రత్త.. శ్రావణి పిల్లలు జాగ్రత్త.. వదిన చిన్నారిని నువ్వే చూసుకో' అని పేర్కొన్నారు.

ప్రాణాలు పోతే తప్ప స్పందించరా?

- ఉరవకొండలో రోడ్డెక్కిన మోడల్ స్కూల్ విద్యార్థులు



ఉరవకొండ ఆర్టీసీ డిపో ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

ఉరవకొండ: 'మా ప్రాణాలు పోతే తప్ప స్పందించరా?' అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ ఉరవకొండలో బుధవారం 200 మంది మోడల్ స్కూల్ విద్యార్థులు రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై గంటకు పైగా రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ చిన్నముస్టూరులోని మోడల్ స్కూల్‌కు రోజూ ఉరవకొండ నుంచి 200 మంది వరకు వెళ్తున్నామన్నారు. ఆర్టీసీ వారు కేవలం ఒక బస్సే నడుపుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అధ్వానంగా ఉన్న మోడల్ స్కూల్ మట్టి రోడ్డులో ప్రయాణం నరకంగా మారిందన్నారు. తల్లిదండ్రులతో కలిసి తమ బాధలను అధికారులతో ఎన్నో సార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగి తమ ప్రాణాలు పోతే తప్ప అధికారులు స్పందించేలా లేరని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు గంట పాటు ఆర్టీసీ డిపో ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ క్రమంలో ఎస్‌ఐ జనార్దన్ నాయుడు, ఆర్టీసీ డీఎం హంపన్నలు విద్యార్థుల వద్దకు చేరుకుని మాట్లాడారు. తమ వద్ద ఆర్టీసీ సర్వీసులు లేవని, కేవలం ఒక్క బస్సు మాత్రమే నడపగలమని డీఎం తెలిపారు. సర్వీసులు అదనంగా వస్తే నడుపుతామని చెప్పారు. డీఎం సమాధానంపై విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఎస్‌ఐ మాట్లాడుతూ అదనంగా మరో బస్సు ఏర్పాటు చేసేలా మాట్లాడతామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

సికింద్రాబాద్- మైసూరు మార్గంలో ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: సికింద్రాబాద్–మైసూర్ మార్గంలో ఈ నెల 8 నుంచి 30 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ జంక్షన్ (07033) నుంచి సోమ, శుక్రవారాల్లో రాత్రి 10.10 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు మైసూర్ జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. మైసూర్ జంక్షన్ (07034) నుంచి మంగళ, శనివారాల్లో సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుతుందన్నారు.బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాదగిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, బెంగళూరు కంటోన్మెంట్, బెంగళూరు జంక్షన్, కెనిగేరి, మండ్య మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. 2టైర్, 3టైర్, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు వక్రభాష్యం

- వ్యక్తి మృతిపై సూపరింటెండెంట్ నిర్లక్ష్యపు సమాధానం



సర్వజనాస్పత్రిలో మరణించిన మధునాయక్ (ఫైల్)

అనంతపురం మెడికల్: తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు రోగి మృతిపై వక్రభాష్యం పలికారు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ ఆత్మారాం. రోగులకు మెరుగైన వైద్య సేవలందేలా చూడాల్సిన బాధ్యతల్లో ఉండీ, ఎక్కడైనా జాప్యం జరిగితే వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సింది పోయి నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం వివాదాస్పదమవుతోంది. వివరాలు.. ఈ నెల 5న సర్వజనాస్పత్రిలో స్ట్రెచర్ అందుబాటులో లేక బెళుగుప్ప తండాకు చెందిన మధునాయక్ (23) ప్రాణాలు వదిలాడు. ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ గది ముందే కుప్పకూలి మృతి చెందాడు. దీనిపై బుధవారం 'సాక్షి'లో కథనం వెలువడగా.. ఇందుకు సమాధానంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం నుంచి వచ్చిన సందేశం నివ్వెరపోయేలా చేసింది. 23 ఏళ్ల మధు నాయక్ తాగుబోతు అని, లివర్ ఫెయిల్ అయ్యిందని అందులో తెలిపారు. చిన్నతనంలోనే తాగుబోతు అయినందుకు బాధేస్తోందని సెలవిచ్చారు. ప్రమాదకర మద్యాన్ని కొన్నేళ్లుగా ఎలా తీసుకుంటున్నాడో అంటూ పేర్కొనడం గమనార్హం. ఆస్పత్రిలో స్ట్రెచర్లు లాంటి మౌలిక వసతులు కూడా రోగులకు అందుబాటులో లేని తరుణంలో సౌకర్యాలను మెరుగుపరచి, సేవలు సరిగా అందేలా చూడాల్సిన ఓ అధికారి.. తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు రోగి స్వీయ తప్పిదంతోనే మరణించాడంటూ పేర్కొనడం ఆయన నైతికతకు అద్దం పడుతోంది.

'స్ట్రెచర్ ఉన్నా బతకడు'

ఇదే విషయంపై ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి చెప్పిన మాటలు వింటే ఎవరైనా విస్తుపోవాల్సిందే. మధు నాయక్ విపరీతంగా తాగుడుకు బానిసయ్యాడని, చివరి అంకంలో ఆస్పత్రికి వచ్చాడని, స్ట్రెచర్‌తో తీసుకెళ్లినా బతకడంటూ ఆయన పేర్కొనడం చూస్తే సామాన్య ప్రజలపై ఎలాంటి అభిప్రాయం ఉందో అర్థం చేసుకోవచ్చు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీపై దాడి హేయం

• మాజీ మంత్రి సాకే శైలజనాథ్



అనంతపురం కార్పొరేషన్: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్‌పై టీడీపీ గుండాలు చేసిన దాడిని మాజీ మంత్రి, శింగనమల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ ఖండించారు. దాడిని హేయమైన చర్యగా అభివర్ణించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి ప్రభుత్వం అటవిక పాలనను సాగిస్తోందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టులతో నిర్బంధానికి తెరలేపారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా డీజీపీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో టీడీపీ గుండాలు మరింత రెచ్చిపోయే అవకాశం ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే సీఎం చంద్రబాబు ప్రస్తుతం తన అనుభవాన్నంత దౌర్జన్యాలకు, దాడులకు చేయడానికి ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని, రానున్న రోజుల్లో ప్రజా తిరుగుబాటును ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు.

పోస్టల్ సేవల పునరుద్ధరణ

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా పోస్టాఫీసుల్లో తలెత్తిన సర్వర్ సమస్య బుధవారం మధ్యాహ్నం తీరింది. తపాలా సేవల విస్తరణలో భాగంగా కేంద్ర తపాలా శాఖ 2.0 సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. కొత్త సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసిన తర్వాత గత నెల 22 నుంచి సర్వర్ తరచూ మొరాయిస్తూ వచ్చింది. సోమవారం పూర్తిగా డౌన్ అయిపోయింది. బుధవారం ఉదయం సమస్యను సాంకేతిక నిపుణులు గుర్తించి పరిష్కరించడంతో మధ్యాహ్నం నుంచి సర్వర్ పని చేయడం మొదలుపెట్టింది.

ఉరవకొండ మార్కెట్ యార్డ్ దూకుడు

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశిత మార్కెట్ పీజు వసూళ్లలో ఈ ఏడాది ఉరవకొండ మార్కెట్ యార్డ్ దూకుడు కొనసాగిస్తోంది. రూ.90 లక్షల లక్ష్యానికి గాను తొలి నాలుగు నెలల్లోనే రూ.46.55 లక్షల వసూళ్లతో 51.72 శాతం ప్రగతితో దూసుకెళుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా రూ.13.49 కోట్ల వసూళ్ల లక్ష్యంగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జూలై ఆఖరు నాటికి 29 శాతం ప్రగతితో రూ.3.95 కోట్లు రాబట్టింది. రూ.5.10 కోట్లు లక్ష్యానికి గానూ అనంతపురం మార్కెట్ యార్డులో 38.58 శాతం ప్రగతితో రూ.1.97 కోట్లు వసూలైంది. శింగనమల కమిటీ 28.58 శాతం వసూళ్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది.

తిరగని బతుకు మీటర్

• వేతనాల కోసం మూడు నెలలుగా మీటర్ రీడర్ల ఎదురు చూపు
• పీఎఫ్ సైతం చెల్లించని వైనం
• కాంట్రాక్టర్ల తీరుపై పర్యవేక్షణ కరువు
• పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



అనంతపురం టౌన్: మీటర్ రీడింగ్‌తో విద్యుత్ శాఖకు ఆదాయం సమకూరుస్తున్న మీటర్ రీడర్ల బతుకు మీటర్ తిరగడం లేదు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్లు మాత్రం సంస్థ నుంచి తమ బిల్లులు తీసుకుంటున్నా.. మీటర్ రీడర్లకు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగుతుండడంతో చిరుద్యోగులకు నోరు మెదపలేకపోతున్నారు. వేతనాల కోసం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు విన్నవించుకోవడమే తప్ప సమస్యకు పరిష్కారం దక్కడం లేదని వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200మంది రీడర్లు

ప్రతి నెలా విద్యుత్ బిల్లులు సకాలంలో తీస్తూ ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థకు రెవెన్యూ సమకూర్చడంలో స్పాట్ బిల్లింగ్ రీడర్లు పాత్ర కీలకం. ఉమ్మడి జిల్లాలో 16 లక్షలకు పైగా విద్యుత్ సర్వీసున్నాయి. ఉమ్మడి జిల్లాలో స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్‌ను కూటమి పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులకు కేటాయించడంతో సమస్య తలెత్తుతోంది. స్వలాభాన్ని మాత్రమే చూసుకుంటున్న సదరు కాంట్రాక్టర్లు మీటర్ రీడర్ల బతుకుల గురించి ఆలోచించడం లేదనే విమర్శలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులతో వారికి మంచి పరిచయాలు ఉండడంతో అధికారులు సైతం వారిని ఏమీ అనలేని పరిస్థితి. దీంతో వేతనాలు సకాలంలో అందక మీటర్ల రీడర్లు నానా అగచాట్లు పడుతున్నారు. గడిచిన ఏడాదిగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఏడాది మే నుంచి జూలై వరకూ వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని మీటర్ రీడర్లు వాపోతున్నారు.

పీఎఫ్, ఈఎస్ఐకి ఎగనామం

స్పాట్ బిల్లింగ్ మీటర్ రీడర్లకు ప్రతి నెలా పీఎఫ్, ఈఎస్ఐను కాంట్రాక్టర్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొన్ని నెలలుగా వీటి చెల్లింపులను సదరు కాంట్రాక్టర్లు పట్టించుకున్న పాపన పోలేదు. ప్రతి నెలా కార్మికులకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా తమ జేబుల్లో నింపుకోవడంపైనే కాంట్రాక్టర్లు దృష్టి సారిస్తున్నారు. ఒక్కో మీటర్ రీడింగ్‌కు రూ.4.25 నుంచి రూ.4.30 చొప్పున రీడర్లు చెల్లిస్తారు. ఈ క్రమంలో ప్రతి బిల్లుపై రూ.1.10 పీఎఫ్‌కు, 20 పైసలు ఈఎస్ఐని కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ చిరు మొత్తానికి కూడా కాంట్రాక్టర్లు ఎగనామం పెడుతున్నారు. వేతనాల కోసం ప్రాధేయపడితే రూ.3 వేలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటున్నట్లుగా సమాచారం. ఈ అక్రమాలు విద్యుత్ శాఖ అధికారులకు తెలిసినా పరిష్కారం చూపడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం

మీటర్ రీడర్లకు సకాలంలో వేతనాలు చెల్లించేలా కాంట్రాక్టర్లను ఆదేశిస్తాం. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదనే విషయం ఇప్పటికే నా దృష్టికి వచ్చింది. బిల్లింగ్ ప్రక్రియ పూర్తి కాగానే పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. తాడిపత్రి ప్రాంతంలో 6 నెలలుగా పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదనే తెలుస్తోంది. అనంతపురం డివిజన్‌లోనూ పీఎఫ్ చెల్లించలేదు. మొత్తం పీఎఫ్ బకాయిలు ఒకేసారి కట్టేలా చర్యలు తీసుకుంటాం.

– శేషాద్రి శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ, అనంతపురం

చదువుకోవాలంటే మురుగు తొక్కాల్సిందే...



పాఠశాలలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

తాడిపత్రి టౌన్: చదువుకోవాలంటే మురుగు తొక్కాల్సిందేనని అంటున్నారు తాడిపత్రిలోని నందలపాడు మున్సిపల్ యూపీ స్కూల్ విద్యార్థులు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న మురుగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో మొత్తం మురుగు పాఠశాల ఆవరణలోకి చేరుతోంది. దీంతో పాఠశాల బయట, లోపల మురుగు నీటి కుంటలు ఏర్పడాయి. నెలల తరబడి మురుగు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులతో పాటు విద్యార్థులు కనీసం భోజనం చేయలేని పరిస్థితి నెలకొంది. మురుగు కారణంగా విపరీతమైన దోమలు వృద్ధి చెందాయి. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన మురుగు

భర్త మోసం.. గర్భిణి బలవన్మరణం

గుంతకల్లు టౌన్: భర్త మోసాన్ని జీర్ణించుకోలేక ఓ గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లులోని సోఫియా స్ట్రీట్‌లో నివాసముంటున్న షేక్ పీర్‌బాషా పెద్ద కుమార్తె షమీమ్ భాను (33) రెండేళ్ల క్రితం తన భర్తతో విడాకులు పొంది ఐదేళ్ల కుమారుడితో కలసి తల్లిదండ్రుల సంరక్షణలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో తన కుమారుడి పేరును రేషన్‌కార్డులో నమోదు చేయించేందుకు సచివాలయానికి వెళ్లిన సమయంలో వీఆర్‌ఓ మహమ్మద్ వలి పరిచయమయ్యాడు. ఇంటిస్థలం, ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్ష తీసుకున్నాడు. అనంతరం 2024, మే 22న అనంతపురంలో పెద్దల సమక్షంలో ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భిణి. ఈ క్రమంలో వీఆర్‌ఓ వలి మొదటి భార్య, ఆమె తమ్ముళ్ల నుంచి బెదిరింపులు మొదలు కావడంతో గత నెల 14న గుంతకల్లు వన్‌టౌన్ పీఎస్‌లో షమీమ్‌భాను ఫిర్యాదు చేసింది. దీంతో వీఆర్‌ఓ వలిపై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న వలి ఆమెను మరింత మానసిక క్షోభకు గురి చేస్తూ వచ్చాడు. కాన్పు దగ్గర పడుతున్న సమయంలో తనకు దగ్గరగా ఉండాలంటూ బుధవారం భర్తను షమీమ్ కన్నీటితో వేడుకుంది. ఆ సమయంలో వలి ఆమె పట్ల నిర్దయగా వ్యవహరిస్తూ తీవ్ర స్థాయిలో దూషణలకు దిగాడు. చస్తే తనకు ప్రశాంతంగా ఉంటుందని మనోవేదనకు గురి చేశాడు. దీంతో భర్త తనను మోసగించాడని నిర్ధారణకు వచ్చిన ఆమె బుధవారం మధ్యాహ్నం తన ఇంట్లో విషపు గుళికలు మింగింది. అనంతరం తనకు తలనొప్పిగా ఉందని, ఆస్పత్రికి వెళ్లొస్తానని చెప్పి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకోగానే అపస్మారకస్థితికి చేరుకుంది. ఆస్పత్రి సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకున్నారు. విషపు గుళికలు మింగినట్లు తెలుసుకుని వైద్యుల సూచన మేరకు వెంటనే అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుత్తి వద్ద మృతి చెందింది. భర్త వలి మానసిక క్షోభ, మోసాన్ని తట్టుకోలేకనే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి పీర్‌బాషా చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మనోహర్ తెలిపారు.



భర్త వలితో షమీమ్ (పెళ్లి ఫొటో)

ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టండి

• వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ విజయశంకరబాబు, డాక్టర్ మల్లీశ్వరి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ కింద వేరుశనగ, పత్తి పంటలు విత్తుకునే సమయం ముగిసినందున ప్రస్తుతం ఈ పంటలు వేసుకోవడం మంచిది కాదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లీశ్వరి తెలిపారు. జూలై ఆఖరుకే ఈ పంటల విత్తుకు సమయం ముగిసిందన్నారు. ప్రస్తుతం అదనపు సమయం కూడా దాదాపు ముగిసినందున వేరుశనగ, పత్తి కాకుండా కంది, ఆముదంతో పాటు ప్రత్యామ్నాయం కింద మరికొన్ని పంటల సాగు చేపట్టాలని సూచించారు.

• ఎర్ర, నల్లరేగడి నేలలు ఈ నెల 15 వరకు కంది విత్తుకోవచ్చు. పీఆర్‌జీ-176 రకం అనువుగా ఉంటుంది. ఈ రకం విత్తనాలు రేకులకుంట వ్యవసాయ క్షేత్రంలో కిలో రూ.150 ప్రకారం అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్‌ఆర్‌జీ-52, ఎల్ ఆర్‌జీ-105 రకాలు వేసుకోవచ్చు.
• ఎర్రనేలల్లో ఆగస్టు, సెప్టెంబర్ నెలంతా జొన్న, పెసర, అలసంద, అనుములు, సజ్జ వేసుకోవచ్చు. నల్లరేగడి భూముల్లో అయితే సెప్టెంబర్‌లో జొన్న అనుకూలం. అలాగే నల్లరేగడి భూముల్లో కొర్ర, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కూడా వేసుకోవచ్చు.
• ఎర్రనేలల్లో ఆగస్టు 15 వరకు, నల్లరేగడి భూముల్లో ఆగస్టు నెలాఖరు వరకు ఆముదం వేసుకున్నా ఇబ్బంది లేదు. ఐసీహెచ్-5, ఐసీహెచ్-66, జీసీహెచ్-8 రకాలు అనుకూలం.
• ఆగస్టు 15 తర్వాత ఉలవ సాగు అనుకూలం. సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా ఉలవ వేసుకోవచ్చు.
• ఇక ఇప్పటికే సాగు చేసిన వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, కంది పంటలకు ప్రస్తుతం ఎకరాకు 20 నుంచి 25 కిలోలు యూరియా పైపాటుగా వేసుకోవాలి. అలాగే వేరుశనగలో అంతరకృషి చేసుకోవాలి. అలాగే ఎకరాకు 200 కిలోలు జిప్సం వేసుకుంటే పైరుగా ఏపుగా పెరగడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయి. కంది, ఆముదంలో ఒత్తుగా ఉన్న మొక్కలు తీసేయాలి.

గుడ్డాలపల్లిలో చోరీ

గార్లదిన్నె: మండలంలోని గుడ్డాలపల్లిలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి మంగళవారం ఉదయం తన సొంత ఐచర్ వాహనానికి అద్దె దొరకడంతో బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తాళం వేసి భార్య అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి నిద్రించింది. బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్న ఆమె.. అప్పటికే తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించింది. బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ.2.15 లక్షల నగదు అపహరించినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

నీటివనరుల ఆక్రమణలు తొలగించాలి

• అధికారులకు డీఆర్‌ఓ మలోల ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో నీటి వనరులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల మేరకు తొలగించాలని సంబంధిత అధికారులను డీఆర్‌ఓ మలోల ఆదేశించారు. వాటర్ బాడీస్ అంశంపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నిఘా (వాచ్ డాగ్) కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, వంకలు, వాగు స్థలాలు, గట్లపై ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బృందంగా ఏర్పడి క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. చెరువులు, నీటి వనరులు ఎన్ని ఆక్రమణకు గురయ్యాయి, వాటిలో ఎన్ని తొలగించారు తదితర అంశాలను పరిశీలించాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతంల్లోనూ నిర్దేశించిన అధికారులు బృందంగా పర్యటించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. వారంలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు మలి సమావేశానికి పురోగతి చూపాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, పంచాయతీరాజ్, పట్టణ ప్రణాళిక, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు హాజరైన మాజీ మంత్రి



ప్రీ పీహెచ్‌డీ పరీక్ష రాస్తున్న ఉషశ్రీచరణ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం నిర్వహించిన పరీక్షకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీ చరణ్ హాజరయ్యారు. ప్రొఫెసర్ కె.రాంగోపాల్ పర్యవేక్షణలో ఫిజిక్స్‌లో ఆమె పీహెచ్‌డీ చేస్తున్న విషయం తెలిసిందే.

'ఆత్మీయ' పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం అర్బన్: విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారాలను అందజేయనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ధర్మవరంలోని ఎన్జీఓ హోమ్‌లో యూటీఎఫ్ జోనల్ స్థాయి నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య అన్ని పాఠశాలల్లో 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. బోధనలో ప్రతిభతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ నైతిక విలువలతో ఎలాంటి క్రమశిక్షణ చర్యలకు లోనుకాని ఉపాధ్యాయులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం నాడు పురస్కారాలను అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 90309 44717, 94417 34907లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, హరికృష్ణ, రాంప్రసాద్, మేరీ వరకుమారి, నాగేంద్రమ్మ, సాయిగణేష్, రామకృష్ణ, నాగిరెడ్డి, రామాంజనేయులు, అమర నారాయణరెడ్డి, వెంకట కిషోర్, బి.ఆంజనేయులు, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



రమేష్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు పీఎస్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రమేష్(45) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొంత కాలంగా సెలవు పెట్టి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం పరిస్థితి విషమించడంతో శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని తన స్వగృహంలో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలియగానే కంబదూరు పీఎస్ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు లేపాక్షిలోని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 23వ తేదీలోపు www. navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. 2026, ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హులను ఎంపిక చేస్తారు. అలాగే ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీ వరకూ గడువు పొడిగించారు.

కళ్లలో కారం కొట్టి డబ్బు లాక్కెళ్లారు!



బాధితుడు భూతప్ప

బ్రహ్మసముద్రం: వృద్ధుడిపై దాడి చేసి రూ.34 వేలను దుండగులు అపహరించారు. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం మామడూరు గ్రామానికి చెందిన వృద్ధుడు భూతప్ప వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కష్టపడి సంపాదించిన డబ్బును పొదుపు చేసుకుంటూ వస్తున్నాడు. ఈ మొత్తానికి ఇటీవల వచ్చిన పింఛన్ కలిపి రూ.34 వేలను భద్రంగా దాచుకుని బుధవారం పొలంలో పని చేసుకుంటుండగా మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు అక్కడకు చేరుకుని కళ్లలో కారం పొడి చల్లి మొత్తం నగదును లాక్కొన్నారు. వృద్ధుడి కేకలు విన్న చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకునేలోపు ఉడాయించారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

గుత్తి సబ్ రిజిస్ట్రార్ మృతి



మహబూబ్ అలీ (ఫైల్)

గుత్తి: స్థానిక రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మహబూబ్‌అలీ (55) మృతి చెందారు. కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. రెండు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో వెంటనే కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

'సమగ్ర' సూపరింటెండెంట్ సరెండర్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ ఇక్బాల్‌ను సరెండర్ చేస్తూ ఏపీసీ శైలజ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి అడిగే సమాచారం ఎప్పటికప్పుడు పంపడంలో సూపరింటెండెంట్ అలసత్వం ప్రదర్శిస్తూ పెండింగ్ పెడుతున్నట్లు తెలిసింది. ఎన్నిమార్లు చెప్పినా ఆయనలో మార్పు లేకపోవడంతో చివరకు సరెండర్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా, మరో ఇద్దరు ఉద్యోగుల తీరు కూడా వివాదస్పదంగా ఉండడంతో వారిని కూడా సరెండర్ చేసే అవకాశమున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది.

ఉద్యోగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత

• జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



కారుణ్య నియామక పత్రాలను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ (చిత్రంలో) సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేస్తూ అకాల మరణం పొందిన ఉద్యోగులకు సంబంధించిన వారసులు 13 మందికి జూనియర్ అసిసెంట్లుగా నియామక ఉత్తర్వులను జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఆమె అందజేసి, మాట్లాడారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోరారు. కేటాయించిన విధులకు సంబంధించి సీనియర్ల సలహాలు తీసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి శ్రీకాళహస్తిలోని కేంద్రంలో శిక్షణ అనంతరం విధుల్లో చేరాల్సి ఉంటుందని జెడ్పీ సీఈఓ శివశంకర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, 'ఎ' సెక్షన్ ఏఓ షబ్బీర్ నియాజ్, సీనియర్ అసిస్టెంట్లు అరుణకుమారి, మాధవి, జూనియర్ అసిస్టెంట్ జోషి ప్రణీత్, టైపిస్ట్ సుభాష్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కంప్యూటర్ అప్లికేషన్, మేథమేటిక్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతం, ఆపై మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఈ నెల 12న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు.

డిటోనేటర్ పేలి కార్మికుడికి గాయాలు

గుంతకల్లు: స్థానిక ధర్మవరం గేట్ వద్ద మున్సిపల్ అధికారులు చేపట్టిన పైప్‌లైన్ పనుల్లో భాగంగా అమర్చిన డిటోనేటర్ ప్రమాదవశాత్తు పేలి ఓ కార్మికుడు గాయపడ్డాడు. వివరాలు.. ధర్మవరం గేట్ సమీపంలో తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రైలు మార్గం కింద పైప్‌లైన్ వేయడానికి దాదాపు 10 అడుగుల మేర గుంత తీసిన తర్వాత గుండురాయి అడ్డు పడింది. దీంతో ఆ రాయిని తొలగించేందుకు బుధవారం మూడు డిటోనేటర్లు పెట్టారు. ఇందులో రెండు డిటోనేటర్లు పేలాయి. పేలని మూడో డిటోనేటర్‌ను తొలగించేందుకు బెంగాల్‌కు చెందిన కార్మికుడు ముస్తఫా గుంతలోకి దిగుతుండగా ఒక్కసారిగా పేలింది. దీంతో కాలికి తీవ్ర గాయమైన ముస్తఫాను చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

• ఇదీ సంగతి!



రాయదుర్గంలోని ఓ వీధిలో చెత్తకుప్పల మధ్య పడేసిన ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్ బ్యాగు

రాయదుర్గం టౌన్: 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' పేరుతో కూటమి ప్రభుత్వం అందజేసిన స్కూల్ కిట్ల నాణ్యతలో డొల్లతనం నెల రోజుల్లోనే బయటపడింది. స్కూల్ విద్యార్థులకు అందజేసిన బ్యాగ్‌ల్లో నాణ్యత లేకపోవడంతో చిరిగి పోతున్నాయి. దీంతో వాటిని చెత్తకుప్పల్లోకి గిరాటేస్తున్నారు. కుట్లు తెగి కొన్ని పూర్తిగా చిరిగిపోతుండగా, మరికొన్ని లాడీలు తెగిపోతున్నాయి. వీటిని ప్రతిసారీ కుట్టిస్తున్నా ప్రయోజనం లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. తాజాగా బుధవారం రాయదుర్గంలోని 17వ వార్డు వెంకటేశ్వర కాలనీలో చెత్తకుప్పల మధ్య పడేసిన స్కూల్ బ్యాగ్ కనిపించింది. చూసిన పలువురు ప్రభుత్వం అందించిన నాణ్యతలేని బ్యాగ్ చివరకు చేరాల్సిన చోటుకే చేరిందంటూ ఎద్దేవా చేయడం విశేషం.

క్లుప్తంగా

కమనీయం.. లక్ష్మీ నారాయణ కల్యాణం



పూజలందుకున్న లక్ష్మీ నారాయణులు

అనంతపురం కల్చరల్: పవిత్ర చాతుర్మాసంలో వచ్చిన శుక్లపక్ష ద్వాదశి సందర్భంగా సాయి ట్రస్టు ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణుల కల్యాణ మహోత్సవం బుధవారం కమనీయంగా సాగింది. స్థానిక తపోవనంలోని శివశక్తి సాయిబాబా దేవాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మణూరు నాగరాజు స్వామి పర్యవేక్షణలో కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. కల్యాణంలోని ఎదుర్కోలు, తలంబ్రాలు, మంగళ్యధారణ వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం తీర్థప్రసాద వినియోగం నారాయణ సేవ చేపట్టారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ చాతుర్మాసంలో వచ్చే 8 ద్వాదశుల రోజున 8 కల్యాణాలను జరిపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవేంద్ర, రాఘవేంద్ర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



మండల కార్యవర్గ సభ్యులతో ఏపీటీఎఫ్ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి మోడల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నిక అధికారి రవీంద్రరెడ్డి తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా అల్లే వెంకటరాముడు, అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా సాయిరాం, జీవిత, వెంకటేశులు, కార్యదర్శులుగా నాగేంద్ర ప్రసాద్, హనుమంతు, నవ్యత, సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్లుగా మరెప్ప, రవికుమార్, విజయరాధిక, రామాంజనేయులు, ఓబుళేసు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, ముత్యాలప్ప, జిల్లా ఆడిట్ కన్వీనర్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

'కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు'



కూటమి వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 19వ డివిజన్‌లో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ ఆ డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదికిపైగా గడుస్తున్నా ఇంత వరకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనుదీప్ రెడ్డి, చింత రామచంద్ర, మనోజ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కుమార స్వామి రాజు సేవలు అమూల్యం



ప్రొఫెసర్ కుమార స్వామి రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగంలో నాలుగు దశాబ్దాల పాటు అంకిత భావంతో కృషి చేసిన ప్రొఫెసర్ కుమార స్వామి రాజు సేవలు అమూల్యమని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర జి.వెంకటనాయుడు అన్నారు. బుధవారం ఇంగ్లిష్ విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ వూటికంటి మాధవి, స్యూటా సంయుక్తంగా ప్రొఫెసర్ కుమార్ స్వామి రాజు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ.. అజాతశత్రువు, మంచి విద్యావేత్త అయిన కుమార్ స్వామి రాజు ఎంతో మంది ఉన్నత విద్యావంతులను తీర్చిదిద్దారని కొనియాడారు. ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ, సెంట్రల్ వర్సిటీ ఆఫ్ ఏపీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ వీవీఎన్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కుమార స్వామి మంచి పరిశోధకులు అని ప్రశంసించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లిష్ ఫ్యాకల్టీ డాక్టర్ ఐజాక్, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ హుస్సేన్ వలి షేక్, అకడమిక్ కన్సెల్టెంట్లు షకీలా, డాక్టర్ అంకన్న తదితరులు పాల్గొన్నారు.

రామా.. కనవేమిరా..!

ఆస్పత్రిలో అందని వైద్యం

- ఓపీల్లో పత్తాలేకుండా పోతున్న వైద్యులు
- రేడియాలజీలోనూ ఇదే దుస్థితి
- నిద్రమత్తులో అధికారులు



ఆర్థో ఓపీ నంబర్-9ఏలో పత్తా లేని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్



గైనిక్ ఓపీ ముందు మహిళల అవస్థలు



అల్ట్రాసౌండ్ స్కాన్ విభాగంలో కనిపించని సిబ్బంది



అల్ట్రాసౌండ్ స్కాన్‌లో మూలకు మూత్రం విసర్జించడంతో అధ్వానంగా కన్పిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యం దైవాధీనంగా మారింది. క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి బాధ్యతారాహిత్యం వైద్యులకు వరంగా.. రోగులకు శాపంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓపీల్లో వైద్యులు ఉండకపోవడం, స్ట్రెచర్, వీల్ చైర్లు లేక రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. రేడియాలజీ విభాగంలోని అల్ట్రాసౌండ్ వెనుక వైపు ఉన్న బాత్‌రూం ఆరుబయటే కొందరు మూత్రం విసర్జిస్తుండటంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. రామా.. కనవేమిరా.. అంటూ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓపీలకు వైద్యుల దుమ్మా..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పేద ప్రజలకు పెద్దదిక్కు ప్రభుత్వ సర్వజనాస్పత్రి. వివిధ ప్రాంతాల నుంచి రోజూ ఓపీకి 2,500 నుంచి 3,000 మంది, ఇన్‌పేషంట్లు 1,100 మంది ఉంటారు. ఇటువంటి తరుణంలో సుదూరు ప్రాంతాల నుంచి వైద్యం కోసం వస్తున్న రోగులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సాక్షాత్తు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం సొంత విభాగం ఆర్థో, అదేవిధంగా చిన్నపిల్లల వార్డు, సైకీయార్టీ, సర్జరీ, గైనిక్, లేబర్, డెంటల్, తదితర ఓపీల్లో వైద్యులు 11:30 గంటల నుంచి 12 గంటలకంతా వెళ్లిపోతున్నారు. బుధవారం ఆస్పత్రిలోని ఓపీ నెంబర్ 9ఏ (ఆర్థో)లో వైద్యుడు డాక్టర్ కిరణ్‌కుమార్ పత్తా లేకుండా పోయారు. పీజీలకు ఓపీని అందించి విధులకు డుమ్మా కొట్టాడు. అదేవిధంగా చిన్నపిల్లల విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధిక 12 గంటలకంతా ఆస్పత్రి నుంచి బైక్‌లో వెళ్లిపోయారు. ఆ విభాగంలో సీనియర్ రెసిడెంట్, పీజీలే చూసుకోవాల్సి వచ్చింది. అదే విధంగా గైనిక్, లేబర్ వార్డులోనూ దయనీయమైన పరిస్థితి. లేబర్ వార్డు ఓపీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అందుబాటులో లేరు. దీంతో పీజీలే గర్భిణులను చూడాల్సి వచ్చింది. గర్భిణులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. పట్టించుకునే నాథుడే లేరు. అదేవిధంగా గైనిక్ విభాగంలో పదుల సంఖ్యలో మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. డ్యూటీ వైద్యురాలు తూతూమంత్రంగా విధులు నిర్వర్తించడంతో మహిళలు నిలుచుండలేక కింద కూర్చోవాల్సి వచ్చింది.

రేడియా'లేజీ'

ఆస్పత్రిలోని రేడియాలజీ విభాగంలోని వైద్యుల్లో లేజీ తగ్గలేదు. బుధవారం అల్ట్రాసౌండ్ స్కాన్ కోసం వచ్చిన రోగులు గంటల తరబడి మంచాలపై ఉండిపోవాల్సిన వచ్చింది. ఉదయం 10 గంటలకు వచ్చినా స్కాన్ చేయలేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ వార్డుల నుంచి వచ్చిన రోగులు స్కాన్ కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా అల్ట్రాసౌండ్ స్కాన్ వెనుక వైపు ఉన్న బాత్‌రూం అధ్వానంగా ఉంది. బాత్‌రూం బయటనే కొందరు మూత్రం విసర్జించడంతో భరించలేని కంపు కొడుతోంది.



స్ట్రెచర్ లేకపోవడంతో బాలుడిని ఎత్తుకెళ్తున్న దృశ్యం

గంటల తరబడి వేచి ఉన్నాం



కాలు నొప్పితో బాధపడుతూ.. ఉదయం ఆస్పత్రికి వచ్చాం. కాలులో రక్తం గడ్డ కట్టింది. నొప్పి భరించలేకున్నా.. ఇక్కడ ఆర్థో ఓపీలో డ్యూటీ డాక్టర్ లేరు. విద్యార్థులే చూసి స్కాన్‌కు రాశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ అంట ఆయన సీలు కోసం గంటల తరబడి వేచి ఉన్నాం. ఓ వైపు నొప్పి.. మరో వైపు కూర్చొనేందుకు జాగా లేదు. మరీ ఇంత నిర్లక్ష్యం పనికిరాదు. – లక్ష్మి, పాతూరు

స్కాన్‌కు మూడు గంటలా?



సార్ పొద్దున్నే 8 గంటలకు ఆస్పత్రికి వచ్చాను. నా పొత్తి కడుపునకు ఆపరేషన్ అయ్యింది. ఇక్కడ వైద్యులు ఏదో స్కాన్ చేయించమన్నారు. ఇక్కడ చూస్తే పట్టించుకునే నాథుడే లేరు. వాకిళ్లు వేసి బయట ఉంచారు. అసలు స్కాన్‌లు చేస్తున్నారో లేదో తెలియదు. మాలాంటోళ్ల బాధ ఎవరితో చెప్పుకోవాలయ్యా? కలెక్టర్ సార్ స్పందించి నిర్లక్ష్యం చేసే వారిని సస్పెండ్ చేయాలి. – పెద్దన్న, కడగండ్ల, కూడేరు

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా నాయకులు

అనంతపురం అర్బన్: దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. పింఛన్ నిలిపేత చర్యలను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో వేదిక జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వసంత కుమార్, రామయ్య మాట్లాడారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. దివ్యాంగులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్, సదరం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, పింఛను నిలిపివేత సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయన్నారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం –2016 అమెండ్మెంట్ చేయాలన్నారు. నిలిపివేసిన వివాహ ప్రోత్సాహకాలు, పింఛన్లు ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. యూడీఐడీ కార్డులు పంపిణీ, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకుంటామన్నారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి రాజేష్, నాయకులు మధు, రంగయ్య, సుధాకర్, మోహన్, నరసింహులు, వెంకటేష్, కుళ్లాయప్ప, నాగన్న, లక్ష్మి, శ్రీనివాసులు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను నీరుగార్చేందుకు కుట్ర



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల సమస్యలు బయటకి వస్తాయనే భయంతో విద్యా సంస్థల్లోకి ఎవ్వరూ వెళ్లకూడదంటూ కూటమి ప్రభుత్వం జీఓ తెచ్చింది. విద్యార్థుల పాలిట శాపంగా మారిన ఈ జీఓను వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల రిబ్బన్లతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జైలులో ఉన్న ఖైదీలను కలవడానికి వెసులుబాటు ఉందికానీ చదువుకునే విద్యార్థులను కలవడానికి అవకాశం లేకుండా చేసిన ఘనత దేశ వ్యాప్తంగా ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మండిపడ్డారు. ఎల్లో బుక్ రూల్స్‌తో విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్నారు. తక్షణమే జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు కైలాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు బయటికి వస్తాయనే భయంతోనే ప్రభుత్వం జీఓ రిలీజ్ చేసిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు మంత్రి నారా లోకేష్ కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి గంగ శివుడు యాదవ్, నగర కార్యదర్శులు ఫయాజ్, కార్తికేయ, రోహిత్, ఆదిల్, జిలాన్, నరేంద్రరెడ్డి, సతీష్, నాగేంద్ర నాయకులు షెక్షా, దాదు, వంశీ నాయుడు, సుబహన్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని నిరసన



మాట్లాడుతున్న ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్

అనంతపురం ఎడ్యుకేషన్: అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో స్వాతంత్ర్య పోరాట గుర్తులు కలిగిన వందేళ్లనాటి చారిత్రాత్మకమైన బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటానికి గుర్తుగా ఉన్న బ్రిటిష్ సైనికాధికారులు స్కాట్ కోవర్డ్, హైటర్ సమాధుల స్థలాల్ని కొంతమంది ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. 46 సెంట్ల సమాధి స్థలంలో 27 సెంట్లు ఇప్పటికే ఆక్రమణకు గురైందన్నారు. తక్కిన 19 సెంట్లలో ప్రస్తుతం నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చారిత్రాత్మకమైన గుర్తులు చెరిగిపోతే భవిష్యత్తులో అల్లూరి స్వాతంత్ర్య పోరాటం యొక్క చిహ్నాలు ఉండవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ స్థలాన్ని రక్షించాలని కోరారు. స్థలాన్ని పురావస్తుశాఖకు అప్పగించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ సురేష్, నాయకులు మహమ్మద్, చరణ్ రాజ్, చరణ్ తేజ్, శ్రావణి, దీపిక, బాబా అలీ, రుద్రేష్, వెంకట్ సాయి పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాప్తాడు: తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నాగరత్నమ్మ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లి పాలను రెండేళ్ల పాటు అందించాలని సూచించారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి సహజ టీకా అన్నారు. వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. తల్లులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీ, లావణ్య, శ్రీవాణి, లీలావతి, భారతి, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- చియ్యేడులో వర్షానికి కూలిన ఇంటి పైకప్పు
- ముందు జాగ్రత్తగా పక్కింటికి వెళ్లిన దంపతులు



రాప్తాడురూరల్: ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ఒక జంటకు గండం తప్పింది. శిథిలావస్థలో ఉన్న ఇంటి పైకప్పు వర్షానికి కూలే ప్రమాదముందని పసిగట్టి వర్షం కురవడం ప్రారంభం కాగానే పొరుగింటిలోకి వెళ్లి దంపతులు తలదాచుకున్నారు. వారు అనుకున్నట్టే జరిగింది. అర్ధరాత్రి ఆ ఇంటి పైకప్పు కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.. లేదంటే ప్రాణాపాయం జరిగేదని బాధితులు, గ్రామస్తులు వాపోతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో ఓ ఇల్లు పైకప్పు కూలిపోయింది. పూజారి రామాంజనేయులుకు చెందిన ఇంటిలో కదిరప్ప, ఉత్తమ్మ దంపతులు అద్దెకు ఉంటున్నారు. పూర్వకాలం ఇల్లు కావడంతో పైకప్పు మట్టిస్లాబుతో వేశారు. మంగళవారం సాయంత్రం నుంచి వర్షం కురవడం ప్రారంభమైంది. శిథిలావస్థకు చేరుకున్న ఇంటి పైకప్పు కూలే ప్రమాదముందని భావించిన కదిరిప్ప దంపతులు సమీపంలోని తెలిసిన వారి ఇంటికి చేరుకున్నారు. వర్షం దాటికి పూర్తిగా దెబ్బతిన్న ఇంటి పైకప్పు అర్ధరాత్రి కూలిపోయింది. బియ్యం, మంచం, ఇతర చిన్న వస్తువులు దెబ్బతిన్నాయి. ఉదయాన్నే బాధితులు, గ్రామస్తులు ఈ ఇంటిని పరిశీలించి హమ్మయ్యా.. గండం తప్పిందంటూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మోహన్‌కుమార్ కూలిన ఇంటిని పరిశీలించారు. నష్టంపై నివేదిక ఇవ్వాలంటూ వీఆర్‌ఓను ఆదేశించారు. వీఆర్‌ఓ వెళ్లి బాధితులతో మాట్లాడి జరిగిన నష్టంపై అంచనా వేసి నివేదిక సిద్ధం చేసి తహసీల్దార్ ద్వారా కలెక్టరేట్‌కు నివేదించారు.

డ్వాక్రా సభ్యులకు నామినీ తప్పనిసరి

అనంతపురం టవర్‌క్లాక్: డ్వాక్రా మహిళలకు తప్పనిసరిగా నామినీ ఉండాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ నరేష్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో ఐద్వా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్‌బ్యాంక్ మేనేజర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లో రికవరీ బాగుందన్నారు. లోన్‌లో ఎటువంటి డిపాజిట్స్ పెట్టనవసరం లేదన్నారు. ప్రతి డ్వాక్రా మహిళ వారికి కావాల్సిన రుణాల గురించి నేరుగా బ్యాంక్ వారిని సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని.. లోన్లు సులభంగా వస్తాయన్నారు. మూడు రోజుల్లో రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. రుణాలను జీవనోపాదికి మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాదేవి, కోశాధికారి సావిత్రి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, వాసుదేవ రెడ్డి, చంద్రిక, శ్యామల, శంషాద్, అశ్విని, గీత, శైలజ, ఫర్వాది, పద్మావతి, వహిదా తదితరులు పాల్గొన్నారు.

శివన్న మృతికి సంతాపం

అనంతపురం అర్బన్: ఉరవకొండ ప్రాంతంలో ఉద్యమాలు నిర్వహించిన సీపీఐ నాయకుడు చాబాల శివన్న మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ సంతాపం తెలిపారు. చిన్నవయస్సులోనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడైన శివన్న.. సుదీర్ఘకాలంగా సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించారన్నారు. అనారోగ్యంతో ఉన్నా కూడా ప్రజాపోరాటాల్లో పాల్గొనేవారన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు రాజకీయంగా అభివృద్ధి కావాలని నిత్యం ఆకాంక్షించేవారని గుర్తు చేశారు. ఆయన మృతి సీపీఐ పార్టీకే కాకుండా కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీపీఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోందన్నారు.

శివన్న మృతి పార్టీకి తీరని లోటు

అనంతపురం అర్బన్: ఉరవకొండ నియోజకవర్గ సీపీఐ సీనియర్ నాయకుడు హోతూరు శివన్న మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున అన్నారు. బుధవారం ఓ ప్రకటనలో ఆయన మృతికి సంతపం తెలియజేశారు. పార్టీలో క్రియాశీలంగా ఉంటూ పేదల పక్షపాతిగా ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించారన్నారు. తుదిశ్వాస వరకు పార్టీ బలోపేతానికికి కృషి చేశారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే నాయకులు సంజీవయ్య, రాజారెడ్డి, శ్రీరాములు, సూర్యనారాయణరెడ్డి సంతాపం తెలిపారు.

నేడు ప్రభుత్వ జీపు బహిరంగ వేలం

రాప్తాడు: అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ జీపును (ఏపీ 02జీ 9914) గురువారం బహిరంగ వేలం వేస్తున్నట్లు అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమా శంకరమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారు జీపు విలువ రూ.20 వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. అనంతపురం రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం వేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలను ఏదేని జాతీయ బ్యాంకులో శిశు అభివృద్ధి పథక అధికారిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు, అనంతపురం రూరల్ పేరు మీదుగా డీడీ తీసి, సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. వేలం పాటలో జీపును కొనుగోలు చేసిన వారు అదే రోజు పాడిన మొత్తంలో 25 శాతం డబ్బు చెల్లించాలన్నారు. మిగిలిన మొత్తం డబ్బు నాలుగు రోజుల్లో చెల్లించాలని తెలిపారు. వేలానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు.

10 నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డులో వెలసిన మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ఈనెల 10 నుంచి మూడు రోజుల పాటూ ఘనంగా నిర్వహిస్తామని మఠం ప్రతినిధులు తెలిపారు. 8న గోపూజలు, లక్ష్మీపూజ, ధాన్యోత్సవం, శాకోత్సవంతో ఆరాధనోత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. 9న నిత్యనూతన ఉపాకర్మ, సామూహిక సత్యదేవుని వ్రతాలు జరుగుతాయి. 10న పూర్వారాధన, సోమవారం మధ్యారాధన, 12న ఉత్తరారాధన వేడుకలు నిర్వహిస్తారు. నిత్యం నిర్మాల్య విసర్జన, వేదపారాయణం, అష్టోత్తర పారాయణ సహిత క్షీరాభిషేకం, పాదపూజ, కనకాభిషేకం, అలంకార తులసీ పూజలు, సాయంత్రం రజిత రథోత్సవంతో పాటూ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. భక్తులు రాఘవేంద్రుల ఆరాధనలో పాల్గొని ప్రసాదాలు అందుకోవాలని సూచించారు.

జేవీవీ నగర కమిటీ ఎన్నిక

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలోని జేవీవీ కార్యాలయంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ ఆధ్వర్యంలో బుధవారం జేవీవీ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీలో మొత్తం 25 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు సాకే భాస్కర్ తెలిపారు. నగర అధ్యక్షుడిగా కేఎస్ఎస్ ప్రసాదరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాకే తిరుపాల్, కోశాధికారిగా ఎం.రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రసూన, గాంగే నాయక్, అర్జున్ నాయక్, వీరరాజు, ముత్యాలన్న, కార్యదర్శులుగా రామకృష్ణ, ప్రసాద్, నాగరత్నమ్మ, శశికళ, తిప్పేస్వామి నూతన కమిటీలో ఉన్నారు. వీరితో పాటూ మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. జేవీవీ కార్యక్రమాలను విస్తృతం చేయడం, విద్యాసంస్థల్లో బలోపేతం చేస్తూ చైతన్యపూరిత సమాజ నిర్మాణంలో జేవీవీ పాలు పంచుకోవాలన్నారు. కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ఆర్టీసీ బస్టాండులో చోరీ

అనంతపురం: అనంతపురం ఆర్టీసీ బస్టాండులో బుధవారం చోరీ జరిగింది. అనంతపురం నగరానికి చెందిన జయలక్ష్మి అనే మహిళ తాడిపత్రి బస్సు ఎక్కుతుండగా పర్సులో నుంచి ఒక తులం బంగారు, రూ.10 వేల నగదు చోరీ అయ్యాయి. బస్సు ఎక్కిన అనంతరం సదరు మహిళ పర్సులో చూసేసరికి బంగారు, నగదు కనిపించలేదు. వెంటనే త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు హెచ్ఎం రాజేశ్వరి, పీడీలు మారుతీ ప్రసాద్, రాఘవేంద్ర తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. మదనపల్లిలో ఈనెల 4 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. అనంతపురం జిల్లా జట్టు తరపున పాఠశాలకు చెందిన అమృత, అంజలి, అనీషా, వైషాలి, భవ్య, అంజలి, సఫీయా, సరితాబాయి ప్రాతినిధ్యం వహించారన్నారు. ఫైనల్స్‌లో కడప జిల్లాతో హోరాహోరీగా పోటీ పడి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.